ఫలితాల తర్వాత మంచి మార్పులు

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, మే 13 : పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో మంచి కోసం మార్పులు వస్తాయని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. పోలింగ్‌లో భాగంగా సోమవారం ఉదయం ముకరంపురలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరీంనగర్ ప్రజలు అభివృద్ధిని ఆకాంక్షించే వారికి అవకాశం ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. వాతావరణం ఎలా ఉన్నా తమ బాధ్యతగా ఓటు వేయాలన్నారు. ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. వినోద్‌కుమార్‌తో పాటు ఆయన సతీమణి మాధవి, కొడుకులు ప్రతీక్, ప్రణయ్, కోడలు హర్షిణి, స్థానిక కార్పొరేటర్ వాల రమణారావు, నాయకులు అక్బర్‌హుస్సేన్ ఉన్నారు.

ఓటేయని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి

కరీంనగర్ రూరల్, మే 13: గత అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుంచి పోటీ చేసిన పురుమల్ల శ్రీనివాస్, కుటుంబీకులు ఓటుహక్కు వినియోగించుకోలేదు. ఆయన సతీమణి కరీంనగర్ రూరల్ మండల జడ్పీటీసీ లలిత సైతం ఓటేయకపోవడం చర్చనీయాంశమైంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యమేనని ఆరోపిస్తున్నారు.

డబ్బులు పంచిన వ్యక్తిపై కేసు

వీణవంక, మే 13: మండలంలో చల్లూరు గ్రామంలో సోమవారం ఉదయం బీజేపీ నాయకుడు రామిడి ఆదిరెడ్డి తమ పార్టీకి ఓటు వేయాలంటూ ఓటర్లకు రూ.11 వేలు డబ్బులు పంచుతుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి వడ్లకొండ ఐలయ్య పట్టుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో అప్పగించగా అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

పోలింగ్ రోజు ప్రచారంపై బీజేపీ ఫిర్యాదు

రాంనగర్, మే 13: ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి కేటాయించిన సీరియల్ నంబర్ 4 టీషర్టును ధరించి పోలింగ్ రోజు ఆ పార్టీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి చంద్రశేఖర్ షేక్ షహాన్షాతో పాటు మరో నలుగురు టీషర్టులు ధరించి కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా వ్యవహరించారని నివేదిక ఇచ్చారు. దీనిపై రిటర్నింగ్ అధికారి సూచన మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

నగరంలోని ముకరంపుర ప్రభుత్వ పాఠశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్


సాధన స్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్


నగరంలోని క్రిస్టియన్స్ కాలనీలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి వి.రాజేందర్‌రావు

నగరంలో ఓటు వేసిన అనంతరం వేలిపై సిరా గుర్తు చూపుతున్న కలెక్టర్ పమేలా సత్పతి దంపతులు

భగత్‌నగర్‌లోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న నగర మేయర్ సునీల్‌రావు

హుజూరాబాద్‌టౌన్: ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు దంపతులు

ప్రశాంతంగా పోలింగ్

- ఎండను సైతం లెక్క చేయని ఓటర్లు
- ఓటేసేందుకు కేంద్రాల వద్ద బారులు
- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల అధికారులు

కార్పొరేషన్/కరీంనగర్ రూరల్/ కొత్తపల్లి/ హుజూరాబాద్‌టౌన్/ వీణవంక/ఇల్లందకుంట/సైదాపూర్/ తిమ్మాపూర్/ తిమ్మాపూర్ రూరల్/ గన్నేరువరం/ మానకొండూర్/మానకొండూర్ రూరల్/ శంకరపట్నం/ చిగురుమామిడి/ చొప్పదండి/గంగాధర, మే 13 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సాయంత్రం 5 గంటల వరకు 55.82 శాతం పోలింగ్ నమోదైంది. నగరంలోని సప్తగిరికాలనీలో బ్రిలియంట్ స్కూల్‌లో అరగంట పాటు ఈవీఎం మొరాయించగా.. అధికారులు వెంటనే సరి చేయించారు. సప్తగిరి స్కూల్, రాంనగర్, కోతిరాంపూర్, రేకుర్తి, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, కిసాన్‌నగర్‌లోని పలు పోలింగ్ బూత్‌ల్లో, కార్ఖానాగడ్డ ప్రాంతంలో ఉదయం 10 గంటల తర్వాత ఓట్లు వేసేందుకు పెద్ద సంఖ్యలో ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ మందకొడిగానే సాగింది. ముఖ్యంగా ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకే సుమారు 50 శాతం మేరకు పోలింగ్ కావడం గమనార్హం.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

నగరంలోని ముకరంపుర ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ బూత్‌తో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం 8 గంటల వరకే తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ స్థానిక సాధన స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు స్థానిక శ్రేయస్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రేయస్ జూనియర్ కళాశాలలో ఓటు వేశారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు కుటుంబ సభ్యులు భగత్‌నగర్‌లో, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్ కుటుంబ సభ్యులతో కలిసి రాంనగర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితో పాటు నగర కమిషనర్ శ్రీనివాస్, జిల్లా ముఖ్య అధికారులు, సిబ్బంది కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కరీంనగర్ మండలంలోని 25 పోలింగ్ కేంద్రాల్లో 71.18 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. గుంటూర్‌పల్లి, నగునూర్ గ్రామాల్లోని మహిళా ఆదర్శ పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలను కుంకుమ బొట్టు పెట్టి స్వాగతించారు. తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. కాగా, మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్న యువ ఓటర్లు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

కొత్తపల్లి మండలం చింతకుంటలో 23వ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో కొంతసేపు ఓటింగ్ నిలిచిపోయింది. అధికారులు మరమ్మతులు చేయడంతో 20 నిమిషాల తర్వాత ఓటింగ్ ప్రారంభమైంది.

చొప్పదండిలో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న సీపీ అభిషేక్ మొహంతి

హుజూరాబాద్ నియోజకవర్గంలో 72.69 శాతం పోలింగ్ నమోదైంది. హుజూరాబాద్ నియోజకవర్గంలోని హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాలతోపాటు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. సీపీ అభిషేక్ మొహంతి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అన్ని మండలాల్లో పర్యటిస్తూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కాగా, హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తన సతీమణి వీ సుధాశ్రీతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వ హైస్కూల్‌లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, జడ్పీహెచ్ఎస్‌లో వైస్ చైర్పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్ ఓటు వేశారు.

మానకొండూర్: ఓటుహక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, కుటుంబ సభ్యులు

వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి–శాలినిరెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు, హిమ్మత్‌నగర్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్–శ్వేత దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) లక్ష్మీనారాయణ వీణవంకలో పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఇల్లందకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీ చైర్పర్సన్ కనుమల్ల విజయాగణపతి ఓటు వేశారు. తహసీల్దార్ రాణి, తదితర అధికారులు పోలింగ్‌ను పరిశీలించారు.

సైదాపూర్ మండలంలో 78.54శాతం పోలింగ్ నమోదైంది. దుద్దనపల్లి, వెన్కేపల్లి గ్రామాల్లో పోలింగ్ సరళిని మంత్రి పొన్నం ప్రభాకర్, వెన్కేపల్లి–సైదాపూర్‌లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పరిశీలించారు. వెన్నంపల్లిలో మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

గంగాధర: బూరుగుపల్లిలో కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

మానకొండూర్ నియోజకవర్గం వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తిమ్మాపూర్ మండలం అలుగునూర్‌లోని 137వ పోలింగ్ బూత్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వినోద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలవనున్నారని ధీమా వ్యక్తం చేశారు. అలాగే తిమ్మాపూర్‌లో ఎంపీపీ కేతిరెడ్డి పనితాదేవేందర్ రెడ్డి, కొత్తపల్లిలో జడ్పీటీసీ ఇనుకొండ జితేందర్ రెడ్డి, నుస్తులాపూర్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గన్నేరువరం మండలంలో 80.63 శాతం పోలింగ్ నమోదైంది.

మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామం మానకొండూర్ మండలం పచ్చునూర్‌లో ఓటు వేశారు. మానకొండూర్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

శంకరపట్నం మండలంలో సాయంత్రం 6 గంటల వరకు 70 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా, మొలంగూర్ పోలింగ్ కేంద్రంలోని 116వ పోలింగ్ బూత్‌లో 45 నిమిషాల పాటు ఈవీఎం మొరాయించగా ఎట్టకేలకు సరి చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అనుచరులతో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటింగ్ సరళిని పరిశీలించారు. మానకొండూర్ స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏసీపీ కాషయ్య ఆముదాలపల్లి తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

చిగురుమామిడి మండలంలో 77.45 శాతం ఓటింగ్ నమోదైంది. ముల్కనూర్, సుందరగిరి, ముదిమాణిక్యం, సీతారాంపూర్ తదితర గ్రామాల్లో కొంతసేపు ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ నిలిచిపోయింది. సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి స్వగ్రామం రేకొండలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. చిగురుమామిడి మండల కేంద్రంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పన్యాల భూపతి రెడ్డి, ఎంపీపీ కొత్త వినీతా, జడ్పీటీసీ గీకురు రవీందర్, జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి ఓటు వేశారు. ఓటింగ్ సరళిపై హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మండల కేంద్రంలో నాయకులతో సమీక్షించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు నాయకులను ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎండను సైతం లెక్కచేయకుండా భారీగా ఓటర్లు తరలి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు చోట్ల ఈవీఎంలు మొరాయించగా అధికారులు వెంటనే స్పందించి సరి చేయించారు. అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు.

నగరంలో ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర చలనచిత్రాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం

వీణవంక: చల్లూరులో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్న యువతి ప్రజ్ఞ

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీఈవో

కలెక్టరేట్, మే 13 : నగరంలోని లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి సోమవారం సందర్శించారు. సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు పలుచోట్ల జరుగుతున్న పోలింగ్ తీరును పరిశీలించారు. పోలింగ్ సరళిని గమనించిన అనంతరం ఓటర్ల వివరాలు నమోదు చేసే రిజిస్టర్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లపై ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ట్రాన్స్‌జెండర్లతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్లమెంట్ పరిధిలో ఉన్న ట్రాన్స్‌జెండర్లంతా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. 18ఏళ్లు దాటి ఓటు హక్కు వచ్చిన ప్రతి ఒక్కరూ ఓటేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతున్నదని వెల్లడించారు. కాగా, అంతకుముందు ఉదయం ఏడు గంటలకే కలెక్టర్ దంపతులు నగర పాలక సంస్థ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. డీఈవో వెంట డీఆర్‌డీవో శ్రీధర్, మెప్మా పీడీ రవీందర్, జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి, స్వీప్ నోడల్ అధికారి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఓటు హక్కు వినియోగించుకున్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్

నగరంలోని సైన్స్ వింగ్ కళాశాలలో ఓటేసేందుకు క్యూలైన్‌లో ఓటర్లు

వెలిచాలలో ఓటు హక్కు వినియోగించుకున్న వీర్ల వెంకటేశ్వర్‌రావు–కవిత దంపతులు

మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న తన పిల్లలతో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు నందెల్లి మహిపాల్

మానకొండూర్ రూరల్: పచ్చునూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

గంగాధర: మధురానగర్‌లో వేలిపై సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

తిమ్మాపూర్: అల్గునూరులో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే రసమయి

మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకులను ఓటింగ్ సరళి అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ కోటేశ్వర్, ఎస్ఐ బండి రాజేశ్ బందోబస్తు నిర్వహించారు. చిగురుమామిడి పోలింగ్ కేంద్రాన్ని డీసీపీ (లా అండ్ ఆర్డర్) లక్ష్మీనారాయణ పరిశీలించారు.

చొప్పదండి మండలంలోని పోలింగ్ కేంద్రాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు వేర్వేరుగా సందర్శించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని రాగంపేటలో ఏర్పాటు చేసిన 123 పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎం మొరాయించడంతో గంటన్నర పోలింగ్ ఆలస్యమైంది. రామడుగు మండలంలో వెలిచాలలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ వీర్ల కవిత ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ ఉపేంద్రాచారి పటిష్ట భద్రతా ఏర్పాటు చేశారు.

కరీంనగర్ రూరల్: నగునూర్‌లో పోలింగ్ కేంద్రంలో మహిళా ఓటర్లకు కుంకుమ బొట్టుతో స్వాగతం పలుకుతున్న మహిళా సిబ్బంది

గంగాధర మండలం మధురానగర్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, చెర్లపల్లి(ఆర్)లో జడ్పీటీసీ పుల్కం అనురాధానర్సయ్య, కురిక్యాలలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, తాజా మాజీ ఉప సర్పంచులు, నాయకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒద్యారంలో పోలింగ్ స్టేషన్‌ను సెంట్రల్ అబ్జర్వర్ అమిత్ కటారియా పరిశీలించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న వెల్మ సంఘం అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాలరావు

గంగాధర: ఒద్యారం పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన సెంట్రల్ అబ్జర్వర్ అమిత్ కటారియా

చిగురుమామిడి: రేకొండలో ఓటు హక్కు వినియోగించుకున్న సీపీఐ జాతీయ నేత చాడ

చిగురుమామిడిలో ఓటు హక్కు వినియోగించుకున్న టీడీసీ మాజీ చైర్మన్ భూపతిరెడ్డి

చొప్పదండి: భూపాలపట్నంలో ఓటు వేసిన జడ్పీటీసీ సౌజన్య–వినయ్ దంపతులు

అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోండి

క్రిస్టియన్ కాలనీలో గల పోలింగ్ కేంద్రంలో కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, మే 13: కరీంనగర్ నియోజకవర్గ ఓటర్లు ప్రజలకు మంచి చేసేవారిని, అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం స్థానిక క్రిస్టియన్ కాలనీలోని శ్రీయ వొకేషనల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటు హక్కు ద్వారానే పనిచేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చన్నారు. దేశంతో పాటు రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు మేచినేని అశోక్ రావు, బత్తుల శ్రీధర్, లంక రవీందర్, గంటల రేణుక, పవన్, రాజు ఉన్నారు.

కొత్తపల్లిలో ఓటేసిన మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు

వీణవంకలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి–శాలినిరెడ్డి దంపతులు

ఇల్లందకుంటలో ఓటేసిన జడ్పీ చైర్పర్సన్ విజయ

హుజూరాబాద్‌లో మున్సిపల్ చైర్పర్సన్ రాధికాశ్రీనివాస్..

హిమ్మత్‌నగర్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్–శ్వేత దంపతులు

సైదాపూర్: వెన్నంపల్లిలో ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్